# ప్రజల మనిషి

తండ్రి మరణించాడన్న టెలిగ్రాం అందుకొని, దక్షిణామూర్తి నలుగురు కొడుకులు నాలుగు వైపులనుండి దాదాపు వొకేసారి దిగేరు.

వారు ఊహించినట్లు దిగ్గానే ఇంటి ముందు శవం కన్పించలేదు. కానీ పదిమంది పెద్ద మనుష్యులు అరుగుమీద కూర్చొని ఏదో చర్చించుకొంటున్నారు.

"రండి రండి. మీకోసమే ఎదురు చూస్తున్నాం," వారిని చూస్తూనే పక్కింటి మాధవయ్య ఎదురు వెళ్ళి ఆహ్వానించాడు.

మాధవయ్యకు గురువు, దైవము దక్షిణామూర్తి, దక్షిణామూర్తికి ఊపిరి మాధవయ్య .ఆ విషయం నలుగురు కొడుకులకు తెల్సు.

'నాన్నగారి శవం ఏదీ? మేం రాకుండానే దహనం జరిపించేసేరా?' వ్యాసుడు తీవ్రస్వరంతో అడిగాడు.

మహాద్రష్టలైన భారతీయ ఋషులు ప్రపంచ తొలివిజ్ఞాన శాస్త్రవేత్తలని దక్షిణామూర్తి నమ్మకం. అలాంటి ఋషి పరంపరకు తన కొడుకులు కొంత మేరకైనా వారసులు కావాలని, వారికి వాల్మీకి, వ్యాస, వసిష్ట, విశ్వామిత్రులని పేర్లు పెట్టాడు. వారు పెద్దయి ఆధునిక మేధావులుగా పేరు పడ్డాక తమ పేర్లను కుదించి, కత్తిరించి, అతుకులు చేర్చి మార్చేసుకొన్నప్పుడు దక్షిణామూర్తి మనసులో నవ్వు కొన్నాడు.

'అలాగే కన్పిస్తోంది వ్యాస్. బట్ - కొడుకులుండగా యితరులు ఎవరో దహనం చేసెయ్యటం - యిటీజ్ అబ్‌జెక్షనబుల్' డాక్టర్ మిత్రకళ్లెర్రచేస్తూ అన్నాడు.

డాక్టర్ మిత్రచరిత్రకారుడు. భారతదేశ చరిత్రను ఎర్రకళ్ళతో వీక్షించి వక్రీకరించి మహా మేధావిగా పేరు పొందాడు. తాగటానికి మంచి నీటిని ఓల్గానుంచి తెప్పించుకొంటానని చెప్పుకోటం గొప్పగా భావిస్తాడు. కానీ గంగానదీ స్నానం పుణ్యం అన్న భావనను ఖండిస్తాడు. వెతికి వెతికి అతను యిద్దరు భర్తలకు విడాకులిచ్చిన డబ్బున్న అమెరికన్ స్త్రీని, పెళ్ళి చేసుకొన్నాడు.

'అలాంటి భయాలు మీకేం అక్కర్లేదు. లోపలికి రండి. అంతామీకే తెలుస్తుంది.'

మాధవయ్య వెంట అంతా లోపలికెళ్ళారు. పెరిగిన తెల్లగడ్డంతో మహాఋషిలా వున్న దక్షిణా మూర్తి మంచం మీద పడుకొని వున్నాడు. మైత్రేయ ఆయన చేత అప్పుడే మందు మింగించింది.

'మీకు నూరేళ్ళాయిష్షు. యిప్పుడే మామయ్యగారు మిమ్మల్ని గురించి వాకబు చేసేరు. మామయ్యా.

ఎవరొచ్చారో చూడండి.'

దక్షిణామూర్తి మెల్లగా కళ్లు తెర్చాడు. కొడుకుల్ని ప్రేమగా చూస్తూ దగ్గరికి రమ్మని కళ్ళతోనే పిల్చేడు.

కానీ నలుగురిలో వొక్కరూ కదల్లేదు. 'నాన్న చనిపోయాడని టెలిగ్రాం యిచ్చారు కదా? యిదేమిటి?' డాక్టర్ మిత్ర తీవ్రధోరణిలో అన్నాడు.

'చచ్చిబతికాడు అనుకోరాదూ? బ్రతికున్నందుకు ఆనందించాలి కాని, అలా మామీద చిరాకు పడ్తావేం?' డాక్టర్, మైత్రేయి కల్సి చదువు కొన్నారు. విశ్వామిత్ర ఆర్ట్ స్టూడెంట్, మైత్రేయి సైన్సు స్టూడెంట్, మైత్రేయిఎప్పుడూ ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్. విశ్వామిత్ర సెకండ్ క్లాస్ స్టూడెంట్.

యిద్దరికి పెళ్ళి చేద్దామని కూడా అనుకొన్నారు. కానీ మైత్రేయి విద్యా వంతురాలయి కూడా 'ఛాందస భావాలను పట్టుకొని వేలాడటం' మిత్రకు నచ్చ లేదు. ఈ దేశ చరిత్రను విదేశీ కళ్ళతో మిత్ర చూడటం మైత్రేయికి నచ్చలేదు.

మైత్రేయి, భావసారూప్యతగల వొక యువకుడితో కల్సి వనవాసుల సేవకు అంకిత మయింది.

'చచ్చి బతికాడా? నాన్‌సెన్స్. పురాణ కథలను నాకు చెప్పకు మైత్రేయీ. దిస్‌యీజ్ సీరియస్ మేటర్. నువ్వు మాట్లాడకు. ఏంఫాదర్ ? బ్రతికుండి చనిపోయినట్లు టెలిగ్రాం ఎందుకిప్పించావు?" దక్షిణామూర్తి మాధవయ్య వైపు చూచి కళ్ళు మూసుకొన్నాడు. "నాన్నగారు యిప్పటికి సంవత్సరంగా మౌనవ్రతంలో వున్నారు మిత్రా. హార్ట్‌స్ట్రోక్ వచ్చి చచ్చి బ్రతికేక యిప్పుడావ్రతం ఆయనకు ఉపయోగించింది. డాక్టర్ ఆనంద్‌గారు ఆయన్ని మాట్లాడించవద్దని, ఆయన మాట్లాడ కూడదని చెప్పేరు'

'డాక్టర్ ఆనంద్ ఎవరు?'

'డాక్టర్ ఆనంద్ గారి పేరే వినలేదా మీరు, భారతదేశంలో బైపాస్ సర్జరీ చేయటంలో ఎక్స్‌పర్ట్ కదా?'

'ఆయనని పిలిపించారా?'

"లేదు. యీ ఊళ్లో తన బంధువు లింటికి స్వంత పనిమీద వచ్చారాయన. ఆ బంధువు మీ నాన్నగారి శిష్యుడు.... అభిమాని. మీ నాన్నగారు చనిపోయారని తెల్సి యిక్కడికి వచ్చాడు. లోకల్ డాక్టర్ మీ నాన్నగారు చనిపోయారని ప్రకటించి అప్పటికే అరగంట అయ్యింది. మీకు టెలిగ్రాం కూడా యిచ్చేసేను. అయినా ఆశ చావక, పెద్ద మనిషి, డాక్టర్ ఆనంద్ గారిని యిక్కడికి తీసుకొచ్చాడు. ఆనంద్ గారు ఆయన్ని చూడగానే ఆయన పూర్తిగా మరణించలేదని చెప్పేడు. ఎలా ఆయన్ని బ్రతికించాడో మాకు తెలియదు కానీ చనిపోయిన ఆ మహానుభావుడిని సజీవుడిని చేసేడాయన. రాత్రే వెళ్ళి పోవాల్సింది డాక్టర్ ఆనంద్‌గారు. కానీ మీతో మాట్లాడటానికి మా కోరికపైన ప్రయాణాన్ని వాయిదా వేసుకొన్నారు. రండి. ఆయన్ని పరిచయం చేస్తాను.

★★★

మరణించిన దక్షిణామూర్తిని ఎలా బ్రతికించిందీ మెడికల్ పరిభాషలో వివరించాడు డాక్టర్ ఆనంద్.

నలుగురు మేధావులకీ మతిపోయింది.

'మనదేశంలో, చనిపోయాక మనిషి తిరిగి బ్రతికే అవకాశం వుందన్న వో నమ్మకం వుంది. ఆ నమ్మకానికి పునాది యిప్పుడు మరుగున పడిపోయిన ఏదో శాస్త్రవిజ్ఞానం అయివుండాలి. క్లినికల్‌గా చనిపోయి కూడా రియల్‌గా బ్రతికివున్న అనేకమంది కేసులను పేపర్లలో మీరు చదివేవుంటారు. రియల్‌గా చనిపోయి క్లినికల్‌గా చనిపోని కేసు మీ ఫాదర్‌ది. అందుకే ఆధునిక పద్ధతుల్లో ఆయన్ని బ్రతికించగలిగేను. కానీ యిది తాత్కాలికం మాత్రమే. ఆయన మరి కొంతకాలం బతికుండాలంటే ఆయనకు సాధ్యమైనంత త్వరలో సర్జరీ చేయాలి. లేకపోతే ఆయన ఎన్నోరోజులు బ్రతకడు'.

'సర్జరీ చేస్తే ఎంతకాలం బతుకుతాడు?

'అయిదు సంవత్సరాలు ఖాయం. కానీ మీ ఫాదర్ యింకా ఎక్కువ కాలం బ్రతకవచ్చు. ఎందుకంటే ఆయనకి బ్రతకాలన్న వాంఛ తీవ్రంగా వుంది.' నలుగురు కొడుకులు ఆశ్చర్య పోయారు!

దక్షిణామూర్తికి ఎనభైఏళ్ళు. భార్య ఎన్నడో చనిపోయింది. బిడ్డలంతా ప్రయోజకులయ్యారు. బాదర బందీలు, బాధ్యతలు ఏమీ లేవు. అలాగని ఆయన జీవితంలో భోగభాగ్యాలను అనుభవించిందిలేదు.

చేసింది బడిపంతులు ఉద్యోగం. చాలీ చాలని జీతంతోనే ఆయన నలుగురు కొడుకుల్ని చదివించి ప్రయోజకుల్ని చేసేడు.

రిటైరయ్యాక ఆయన్ని తమ వద్దకు రమ్మన్నారు.

'యిక్కడేముంది? యిల్లు అమ్మేయండి. ఒక్కొక్కరి దగ్గర మూడు నెలలున్నా మీజీవితం నిశ్చింతగా గడిచిపోతుంది. నలుగురు కొడుకులుండి తండ్రిని వదిలేసి వెళ్ళేరన్న అపఖ్యాతి మాకెందుకు?'

'ఆ అపఖ్యాతి మీకు రానివ్వను. వీలవుతే మీరే మూడునెలల కు ఒక్కొక్కరు చొప్పున యిక్కడికొచ్చి నాలుగురోజులు వుండిపోతుండండి. మీ నీడలో నా జీవితంనిశ్చింతగా జరిగిపోతుందన్న మాట నిజమే. కానీ ఇక్కడే వుంటే ప్రయోజవంతంగా గడుస్తుంది.'

'అంటే '

'అంటే ఏమిటో నేను చెప్పను.' అని ఆయన అనలేదు. నవ్వి వూరు కొన్నాడు.

'ఏమిటో! మీ పిచ్చి మీకానందం. మేమేంచేస్తాం.' అనుకొంటూ వెళ్ళి పోయారు.

ఇదంతా ఇరవైఏళ్ళక్రితం సంగతి. రిటైరయ్యాక ఆయన చాలాకాలం బ్రతికేడు. అయినా ఆయనకు జీవితం మీద విరక్తి కలగలేదు?

యాంత్రిక జీవితంతో విసిగి పోయినప్పుడు తమకే అప్పుడప్పుడు విరక్తి కలుగుతుందే? అలాంటిది- ఆయన జీవన రహస్యం ఏమిటి?

'ఆయన మరికొంతకాలం బ్రతకటం అవసరం అని నా అభిప్రాయం కూడా. ఎందుకంటే ఆయన బ్రతకాలనుకొంటున్నది తన కోసంకాదు. జనం కోసం, దేశంకోసం' డాక్టర్ ఆనంద్ అన్నాడు.

'ఇంతకీ ఆపరేషన్ ఖర్చు మాట చెప్పేరు కాదు!'

'చెప్పటం అవసరం అనుకోలేదు. ఎందుకంటే తండ్రి ప్రాణానికి వెల గట్టాల్సిన అవసరం మీకులేదుకదా? మీఫాదర్ రియల్ వేల్యూతోపోలిస్తే ఆయన్ని బ్రతికించటానికయ్యే ఖర్చు చాలాతక్కువ. జస్ట్‌వన్ లేక్ రూపీస్.'

'వన్‌లేక్'! నలుగురు మొహమొహాలు చూచుకొన్నారు.

'ఓకే డాక్టర్! ఆలోచించుకొని చెప్తాం.

'అలాగే, కానీ మీ నిర్ణయాన్ని ఎంత త్వరగా చెప్తే అంతమంచిది. మీ ఫాదర్‌ని బొంబాయి తీసుకెళ్లాలి. మీ నిర్ణయం కోసం నా ప్రయాణాన్ని మరికొంతసేపు వాయిదా వేస్తాను'.

★★★

గంటకుపైగా రహస్య చర్చలు జరిపి నలుగురు కొడుకులు బయటికి వచ్చారు. తమనిర్ణయం చెప్తారని, ఎదురు చూస్తున్నవారు ఆశించారు.

'మానాన్నగారితో మేము ఏకాంతంగా కాస్సేపు మాట్లాడాలి. మీరంతా బయటికెళ్తారా. ప్లీజ్..'

మాధవయ్యతో సహా అంతా వాకిట్లోకి వెళ్లిపోయారు.

మైత్రేయి మాత్రం దక్షిణామూర్తి పక్కదగ్గరినుంచి కదలలేదు.

"మైత్రేయీ, నువ్వుకూడా. ప్లీజ్..."

అప్పుడు దక్షిణామూర్తి కళ్ళు తెర్చేడు. తలను అడ్డంగా ఊపుతూ కళ్ళతో ఏవో సౌంజ్ఞలు చేసేడు.

'నేను కూడా వెళ్ళిపోతే మీరు ఆయనతో మాట్లాడలేరు. నేను ఆయన మౌత్‌పీస్‌ను. ఆయన భావాల అనువాదకురాలిని. అదే మీతో చెప్పమంటున్నారు మామయ్య.'

'అవును' అన్నట్లు దక్షినామూర్తి తల ఊపేడు.

'నాన్నగారూ, మీకొడుకులం మేము. పెద్దవారుగా మా మేలుకోరటం మీ బాధ్యత. అవునా?'

'అవును. అందుకే నా ఆదర్శాలకు విరుద్ధంగా ప్రవర్తించిన మిమ్మల్ని పల్లెత్తుమాటనలేదు. ఎంత భ్రష్టులయినా మీరు నా కొడుకులనే ప్రేమిస్తున్నాను.'

'మైత్రేయీ, నాన్నగారు ఇన్ని మాటల్ని చెప్పలేదు. మామీద కోపంతో నువ్వే కల్పించి కవిత్వం చెప్తున్నావు. దటీజ్ టూమచ్. నీస్థానం తెల్సుకోటం మంచిది.'

'ఏం మామయ్యా? నేను కల్పించి చెప్పేనా?'

లేదన్నట్లు తల వూపేడు దక్షిణామూర్తి.

'డాక్టర్ మిత్రా, ఎప్పుడో జరిగి పోయిన చరిత్రకాదిది-మనయిష్టం వచ్చినట్లు వక్రీకరించటానికి. నేను మీ లాంటి చరిత్రకారు రాలిని కాదు. యు మస్ట్ నోయిట్.'

'నాన్నగారూ. డాక్టరు గారు మీకు ఆపరేషన్ చేయాలంటున్నాడు. మీకు శ్రమ, మాకు డబ్బు ఖర్చు తప్ప యీ వయసులో ఆపరేషన్ చేయించటంవల్ల లాభంవుండదన్న నిర్ణయాని కొచ్చాము మేము. కనుక మీరిప్పటికైనా నాతో ఢిల్లీ వస్తే మంచి వైద్యం చేయిస్తాను. నాదగ్గరికి కాకపోతే తమ్ముళ్లెవరి దగ్గరికయినా సరే. కానీ మీరింకా యీ ఊరిని, యిక్కడ మనుష్యుల్ని పట్టుకొని వేలాడటం మాకెవరికి యిష్టం లేదు. లోకం ఏమనుకొంటుందో ఆలోచించండి. ప్లీజ్ డాడీ' వాల్మీకి అన్నాడు.

దక్షిణామూర్తి కళ్ళు తెరవలేదు.

"పైగా కన్న కొడుకులమైన మాకన్నా యిరుగు పొరుగు వారు మీకు ఆత్మీయులు కావటం మాకు బాధాకరంగా వుంది. అవమానంగా కూడా వుంది.'

దక్షిణామూర్తి కళ్ళుతెరిచి మైత్రేయి వైపు చూచాడు.

మైత్రేయి ఆయన తల గడ కింద నుంచి ఒక కవరు తీసి వాల్మీకి కిచ్చింది. చించి అందులో కాగితం తీసేడు అతను.

వీలునామా కాగితం అది!

'మీరు నా కొడుకులు. నాకు, నా వంశానికి వారసులు. అందుకు పిత్రార్జితమైన యీ యింటిని మీకిస్తున్నాను.అయితే జన్మత: వారసులయ్యారు కాని,యీ కుటుంబం అనాదిగా అనుసరిస్తున్న విశ్వాసాలకు, సంస్కృతికి మీరు నిజమైన వారసులు కాలేకపోయారు. నాకున్న యీ భౌతిక సంపదకన్నా, సాంస్కృతిక వారసత్వ సంపదకే నేను విలువనిస్తాను. ఏనాటికైనా మీరు ఆ సంపదకు వారసులు కావాలని నా కోరిక' విల్లు కాగితానికి ముందున్న నోట్ ను చదివేడు వాల్మీకి.

నలుగురి మొహాలలో తృప్తిని గమనించింది మైత్రేయి.

అంటే వారు తండ్రికున్న ఆ కాస్త ఆస్తినీ కాంక్షించారన్నమాట!

'యీ యిల్లు అమ్ముకుంటే నాకు లక్షకు పైగా డబ్బువస్తుంది. కానీ అమ్మదల్చుకోలేదు. ఎందుకంటే యీ యింటికి వారసులు మీరు. వారసత్వంగా సంక్రమించిన ఆ హక్కుతోపాటు, తండ్రి అభీష్టాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత కూడా మీ మీద వుంది. నా లక్ష్యసాధనకోసం ఎలాగైనా నాకు మరి కొంతకాలం బతకాలని వుంది.'

'అసలు మీ లక్ష్యం ఏమిటి?'

'ధర్మరక్షణ. అందుకై నేను తల పెట్టిన చిన్న కార్యం పూర్తి చేయాలి.'

కొడుకులు అర్థం కానట్లు మొహంపెట్టేరు. పెద్ద కొడుకు వాల్మీకి మళ్ళీ అందుకొన్నాడు. "నాన్నగారూ మీరు బ్రతకాలనే మా కోరిక కూడా. కానీ ఆపరేషన్ చేస్తే మీరు బ్రతికే చాన్సెస్ తక్కువ. డబ్బు కోసం డాక్టరు లక్ష చెప్తారు. అవన్నీ నమ్మితే ఎలా? పైగా బోలెడంత ఖర్చుతో కూడిన వ్యవహారం. యీ వయసులో నమ్మకంలేని ఆపరేషన్ కోసం లక్షలు ఖర్చు పెట్టటం దండగకదూ?'

దక్షిణామూర్తి కళ్లుమూసుకొన్నాడు. కనుకొలకుల్లో చెమ్మ ఊరటం గమనించింది మైత్రేయి.

'వాల్మీకి గారూ, చిన్నతనంలో మీకేదో విషజ్వరం వచ్చింది. డాక్టర్లు మీరు బ్రతకరన్నారుట. అయినా మీ అమ్మగారు మీ కోసం రాత్రింబవళ్లు కనిపెట్టుకొని వుండి సేవలు చేసింది. దేముళ్ళను ప్రార్థించింది. మీ కోసం తన ప్రాణసమానమైన జుట్టును మొక్కుగా యిస్తానని మొక్కుకోంది. మీ ప్రాణం కోసం తను మృత్యువుతో పోరాడి మిమ్మల్ని దక్కించుకోంది. మరోసారి మీ తమ్ముడు వ్యాసుడు గారికి ఏక్సిడెంట్ అయింది. సీసాలు సీసాలు రక్తం కావల్సి వచ్చింది. తమ బలహీనతని లెక్కచేయకుండా మీ అమ్మా నాన్నలు తమ రక్తాన్నంతా ఇచ్చేసారు. వసిష్టుడు గారి పైచదువులకి సీట్ వచ్చింది. బోలెడంత డబ్బిచ్చి పంపాలి. చేతిలో చిల్లుపైసా లేదు. అప్పుడు మీ తల్లి తండ్రులు విశ్వామిత్రకు మాత్రం అన్నం పెట్టి తాము మాత్రం రెండు రోజుల కోసారి గంజినీళ్ళు తాగి గడిపేరు. విశ్వామిత్రగారి కిడ్నీలు చెడి పోయాయి. డాక్టర్లు అర్జంటుగా ఆపరేషన్ చేసి ఒక్క కిడ్నీనైనా వెయ్యాలన్నారు. కిడ్నీని - తన కిడ్నీని, అప్పటికప్పుడు తీసి తనకొడుక్కి అమర్చమన్నాడు మీ తండ్రి. ఒకర్ని బిచ్చమెత్తకుండా ఆపరేషన్‌కి అయిన ఖర్చును ఎలా భరించాడో యిప్పటికీ ఎవరికీ తెలియదు. ఏ వొక్క సందర్భంలోను ఆ తల్లిదండ్రులు ఖర్చును గురించి ఆలోచించలేదు. ఛాన్సెస్‌ను గురించి ఆలోచించ లేదు. తమ బిడ్డల శ్రేయస్సును గురించి ఆలోచించారు. వారుకూడా అప్పుడు ఖర్చును గురించి, ఛాన్సెస్‌ను గురించి, తమ సుఖాన్ని గురించి ఆలోచిస్తే మీరిప్పుడు ఎక్కడుండేవారు? ఏమయ్యేవారు?'

నలుగురు కొడుకులు మైత్రేయి వైపు తీవ్రంగా చూచారు.

'యీ ప్రశ్నలన్నీ మీ నాన్నగారివి కావు. ఆయన యిలాంటి ఆలోచనలకే అతీతుడు. కానీ నేను ఆయనంత గొప్ప దాన్నికాను. మామూలు మనిషిని. అందుకే మామూలు మనిషిలా యీ ప్రశ్నల్ని అడిగేను. కోపించగలరే కాని మీరు నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేరు. కానీ ఏనాటికైనా ఆ ప్రశ్నలకి సమాధానాలు ఆలోచించుకొంటే మీలో నిద్రపోతున్న సంస్కారం మేలు కొంటుంది. స్వార్థ వ్యామోహాలు కొంతయినా పోయి మానవత్వం మీలో పరిమళిస్తుంది.''

యింతలో డాక్టర్ ఆనంద్, అతని వెనుక మాధవయ్య మరో పదిమంది లోపలికొచ్చారు.

'వెల్ ,ఫ్రెండ్స్, మీనిర్ణయంఏమిటి?'

"యీ స్థితిలో మా నాన్నగారికి ఆపరేషన్ అనవసరం అని మా అభిప్రాయం. మీ సహాయానికి థాంక్స్. మీరిక వెళ్ళవచ్చు.'

'నా తొందరకూడావెళ్ళాలనే. ఒంటరిగా కాదు. మీ నాన్నగారిని తీసుకొని. మాధవయ్యగారూ- మీరు ఏర్పాట్లు చూడండి.'

' కానీ డాక్టర్, ఆయనమీద పైసా ఖర్చు పెట్టటానికి మేము సిద్దంగా లేము.'

డాక్టర్ నవ్వి చేతిలో బ్రీఫ్‌కేస్ తెర్చాడు.

డబ్బు! వందరూపాయల నోట్ల కట్టలు!

'అదృష్టవశాత్తు మీ నాన్నగారి నిజవిలువను తెల్సినవారు యీ ఊళ్ళోనే చాలామంది వున్నారు. దేశంలోయింకా ఎందరో వుండవచ్చు.'

"అయితే మా దగ్గిర యీ నాటకం అంతా ఎందుకాడేరు?'

'నాటకం కాదు, నిజం, మీరాయన కన్న కొడుకులు, వంశ వారసులు కదా? ఆయన్ని బ్రతికుంచుకొనే అవకాశాన్ని ముందు మీకివ్వటం ధర్మం. ఏమంటారు?'

' మరి యిప్పుడు మేము ఆయన కొడుకుల్ని కామా? వారసులం కామా? మా మాటను కాదని ఎందుకు తీసుకెళ్తున్నారు?'

'ఎందుకంటే - వారసత్వంగా రావల్సిన ఆస్తిని ఆయన మీకు యిచ్చి వేసేరు కనుక, ఆయనిప్పుడు ప్రజల మనిషి. వారి కోరిక ననుసరించి తీసుకు వెళ్తున్నాను.'

సమస్త సదుపాయాలు అమర్చబడిన మెడికల్ వేను వచ్చి యింటి ముందు ఆగింది. అంతా కల్సి దక్షిణా మూర్తిని వేన్‌లో పడుకోబెట్టేరు.

ఆయన పక్కన మాధవయ్య మైత్రేయి కూర్చున్నారు.

మిగతా జనం కార్లలో ఎక్కేరు. కార్లు బయలుదేరటానికి సిద్ధంగా వున్నాయి.

'ఓకే ఫ్రెండ్స్, యిప్పుడు మీరీ యింటికి - అంటే యిటుకలు, సున్నంతో నిర్మించిన యీ యింటికి-వారసులు. కానీ ఎప్పటికైనా మీ నాన్నగారికి నిజమైనవారసులు కావటానికి ప్రయత్నించండి. అప్పుడు మీకీ దేశంలో గౌరవం పెరుగుతుంది."

వేను, కార్లు ముందుకు దూసుకు పోయాయి.

నిశ్చేష్టులై చూస్తూ నిల్చుండి పోయారు నలుగురు కొడుకులూ!

వారిలో అంతర్మధనం ఆరంభమయిందని వారి మొహాలు సూచిస్తున్నాయి.

(జాగృతి, 1990, ఉగాది ప్రత్యేక సంచిక కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ)